




ఘనంగా రంజాన్

- జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక ప్రార్థనలు
- శాంతి సందేశమిచ్చిన మత పెద్దలు






కుబ్రా ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న అంజద్‌బాషా సిద్దీఖీ



బనగానపల్లె టీడీపీ కార్యాలయంలో ముస్లింలకు రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి బీసీ



ఆల్‌పుర్ఖాన్ ఈద్గాలో సందేశం ఇస్తున్న అబ్దుల్ హాదీ

నంద్యాల కల్చరల్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్ పర్వదినాన్ని సోమవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ తెలుపుకున్నారు. నంద్యాల పట్టణంలో ముస్లింలు ఈద్గాలలో ప్రార్థనలు నిర్వహించారు. ఎస్సార్బీసీ కాలనీ ఈద్గా (తయ్యబా ఈద్గా)లో రఫీ, భీమవరం రోడ్డులోని ఈద్గా(ఆల్‌ఫుర్‌ఖాన్‌ఈద్గా)లో అబ్దుల్‌హాదీ, బొమ్మలసత్రం మసీదు ఈద్గాలో మౌలానా మహబుబ్ బాషా, తిక్కస్వామి దర్గావద్ద ఈద్గా (కుబ్రా ఈద్గా)ల అంజద్‌బాషాసిద్దిఖీ తదితర మౌలానాలు ఈద్గాలలో రంజాన్ ప్రార్థనలు నిర్వహించారు. ఈ ప్రార్థల్లో ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, ఏపీపీఎస్సీ మాజీ సభ్యుడు డాక్టర్ నౌమాన్ తదితరులు పాల్గొని రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మత పెద్దలు మాట్లాడుతూ.. ప్రేమ, సోదరభావం, శాంతికి చిహ్నమే రంజాన్ పండుగ అన్నారు. రంజాన్ పర్వదినాన్ని జరుపుకొని మత సామరస్యాన్ని చాటుకోవడం స్ఫూర్తిదాయకమన్నారు. ఈ ఏడాది వర్షాలు కురిసి, పంటలు సమృద్ధిగా పండి ప్రజలు సుఖసంతోశాలతో జీవించాలని మత పెద్దలు ప్రార్థనలు చేశారు.



ఆల్‌పుర్‌ఖాన్‌ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న దృశ్యం





ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా తదితరులు

రాములోరి కల్యాణోత్సవానికి
నంద్యాల తలంబ్రాలు
ఒంటిమిట్టకు తరలించిన భక్తులు



వడ్లను గోటితో వలిచిన తలంబ్రాలను ఒంటిమిట్ట రామాలయానికి తీసుకెళ్తున్న భక్తులు

నంద్యాల కల్చరల్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): కడప జిల్లా ఒంటిమిట్ట శ్రీరాముల వారి కల్యాణోత్సవానికి తలంబ్రాలు సిద్ధమయ్యాయి. ప్రతి ఏటా ప్రభుత్వం ఘనంగా నిర్వహించే ఒంటిమిట్ట రాములోరి కల్యాణోత్సవానికి నంద్యాల జిల్లా నుంచి ప్రత్యేకంగా తలబ్రాలు సిద్ధమవుతాయి. నంద్యాల పట్టణంలోని సంజీవనగర్ రామాలయంలో వడ్లను గోటితో వలిచిన తలంబ్రాల బియ్యం కోసం సోమవారం పూజలు చేశారు. అనంతరం తలంబ్రాల బియ్యంను కోదండరామస్వామి ఆలయంలో పూజ చేయించి 'మన ఊరు-మన గుడి' మన బాధ్యత నిర్వాహకులు ఒంటిమిట్ట రామాలయానికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో గురురాఘవేంద్ర విద్యాసంస్థల ఛైర్మన్ దస్తగిరి రెడ్డి, భగవత్ సేవాసమాజ్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ కోసం పిడకల సమరం

- సమరంలో 45 మందికి పైగా స్వల్ప గాయాలు
- కర్నూలు జిల్లాలో ఏళ్ల తరబడి వినూత్న ఆచారం

7




కరువు కాలంలో ఉపశమనం..!

- ఉమ్మడి జిల్లాలో 15 కరువు మండలాల ఎంపిక
- తీవ్ర కరువు ప్రభావిత మండలాలు 10
- కర్నూలు జిల్లాలో 9, నంద్యాల జిల్లాలో ఒకటి
- రబీ సీజన్ కోసం ఎంపిక చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

ఖరీఫ్ కాస్త కరుణించినా, రబీ సీజన్ కన్నీరే నింపింది. ఉమ్మడి జిల్లాలోని పలు మండలాల్లో వానలు సరిగా కురవలేదు. నానా కష్టాలుపడి పంటలు సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం రబీ రైతులకు ఉపశమనం కల్పిస్తూ ఉమ్మడి జిల్లాలో 15 కరువు మండలాలను ఎంపిక చేసింది. అందులో పది మండలాలు తీవ్రంగా కరువువాత పడ్డాయని గుర్తించింది. ఇందులో కర్నూలు జిల్లాలో తొమ్మిది, నంద్యాల జిల్లాలో ఒక మండలం ఉన్నాయి.

కర్నూలు/నంద్యాల ఎడ్యుకేషన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): కరువు పీడిత మండలాల రైతులకు కొంతలో కొంత ఉపశమనం కలిగించే నిర్ణయం ప్రభుత్వం తీసుకుంది. కరువు మండలాలను ప్రకటించింది. వర్షపాతం, పొడి వాతావరణంతో పాటు సాగు విస్తీర్ణం, పంట నష్టం, భూగర్భ జలాలు స్థాయి, వ్యవసాయ స్థితిగతులు వంటి అంశాలను పరిగణలోకి 2024-25 రబీ సీజన్‌లో కరువు మండలాలను ప్రభుత్వం ఎంపిక చేసింది. జిల్లా కలెక్టర్లు పంపిన ప్రతిపాదన మేరకు ఈ నెల 28న వర్చువల్ ద్వారా సమావేశమైన కరువు ప్రభావ కమిటీ ఆరు జిల్లాల్లో 37 మండలాలను కరువు మండలాలుగా రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. కర్నూలు జిల్లాలో 9, నంద్యాల జిల్లాలో 5 మండలాలు ఎంపిక చేస్తూ రెవిన్యూ (విపత్తుల నిర్వహణ) శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా ఉత్తర్వులు జారీ చేశారు. అయితే.. జిల్లా పశ్చిమ మండలాల్లో తీవ్ర కరువుతో తల్లడిల్లుతున్న పలు మండలాలకు ఈ జాబితాలో చోటు దక్కలేదు. రెండు విడతలోనైనా ఎంపిక చేయాలని రైతులు కోరుతున్నారు.

కర్నూలు జిల్లాలో రబీ సాధారణ సాగు విస్తీర్ణం 1,17,288 హెక్టార్లు. గత ఏడాది 2023-24 రబీలో 94,391 హెక్టార్లలో వివిధ పంటలు సాగు చేస్తే.. ఈ ఏడాది 2024-25 రబీ సీజన్‌లో 87,320 హెక్టార్లలో సాగు చేశారు. అంటే.. సాధారణం కంటే 29,968 హెక్టార్లు సాగు తగ్గింది. ఆహార ధాన్యాల (ఫుడ్ గ్రైన్స్) పంటలు 18,176 హెక్టార్లకు గానూ 19,548 హెక్టార్లలో సాగు చేశారు. పప్పు దినుసుల పంటలు 69,958 హెక్టార్లకు గానూ 43,345 హెక్టార్లలో సాగు చేశారు. సాధారణం కంటే 38 శాతం తక్కువ సాగు అయ్యింది. నూనే గింజల (ఆయిల్ సీడ్స్) పంటలు 16,081 హెక్టార్లకు గానూ 9,104 హెక్టార్లలో సాగు చేశారు. ఈ పంటలు కూడా సాధారణం కంటే 43 శాతం తక్కువ సాగు చేశారు. ఉద్యాన పంటలు 6,853 హెక్టార్లకు గాను 5,681 హెక్టార్లలో మాత్రమే సాగు చేశారు. సాధారణం కంటే 17 శాతం తక్కువ సాగు చేశారు. అన్ని రకాల పంటలు పరిశీలిస్తే సాధారణం కంటే 26 శాతం తక్కువ సాగు చేసినట్లు వ్యవసాయ అధికారులు పేర్కొన్నారు. అదే క్రమంలో వర్షపాతం కూడా రబీలో సాధారణం కంటే తక్కువే నమోదు అయ్యింది. పలు మండలాల్లో కనీస వర్షపాతం కూడా నమోదు కాలేదని అధికారులు అంటున్నారు. కరువు మండలాల ఎంపిక కోసం భారత ప్రభుత్వ మాన్యువల్-2016 మార్గదర్శకాలకు అనుగుణంగా వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి ఇచ్చిన నివేదిక ప్రకారం జిల్లా కలెక్టర్ పి. రంజిత్‌బాషా రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదన పంపించారు. పరిశీలించిన కరువు కమిటీ సిఫారసు మేరకు అత్యంత తీవ్ర కరువు మండలాలుగా ఆస్పరి, కల్లూరు, కర్నూలు రూరల్, కర్నూలు అర్బన్, మద్దికెర, ఓర్వకల్లు, గూడూరు, కోడుమూరు, వెల్దుర్తి మండలాలను ఎంపిక చేశారు. పత్తికొండను సాధారణ కరువు మండలాల జాబితాలో చేర్చారు. ఆ మండలాల రైతులకు కరువు సహాయక ప్రయోజనాలు కలిగే అవకాశం ఉంది.



మిగతా 7వ పేజీలో



శ్రీగిరిపై ముగిసిన ఉగాది ఉత్సవాలు

- అశ్వవాహనంపై ఆది దంపతుల విహారం
- నిజరూప అలంకరణలో భ్రమరాంబదేవి

శ్రీశైలం, మార్చి 31(ఆంధ్రజ్యోతి): శ్రీశైల మహాక్షేత్రంలో సోమవారం ఉగాది మహోత్సవాలు యాగపూర్ణాహుతితో ఘనంగా ముగిశాయి. కార్యక్రమంలో ముందుగా స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు జరిపించి అనంతరం స్వామివారి యాగశాలలో చండీశ్వరస్వామికి ప్రత్యేక పూజాధికాలు చేశారు. అమ్మవారి ఆలయ యాగశాలలో చండీహోమం జరిపారు. తరువాత యాగపూర్ణాహుతి, వసంతోత్సవం, త్రిశూలస్నానం నిర్వహించారు. నారికేళాలు, సుగంధ ద్రవ్యాలు, ముత్యం, పగడం, నూతన వస్త్రాలు తదితరాలను హోమగుండంలోకి ఆహుతిగా సమర్పించి యాగపూర్ణాహుతి కార్యక్రమాన్ని పూర్తిచేశారు. చివరగా పుష్కరిణిలో త్రిశూలస్నానం జరిపించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈఓ ఎం.శ్రీనివాసరావు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.



యాగశాలలో పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు, ఈఓ

అశ్వవాహనంపై ఆది దంపతుల విహారం

ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు భ్రమరాంబ సమేత మల్లికార్జునుడు అశ్వవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఉదయం స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన అశ్వవాహనంపై ఆశీనులను చేసి అర్చకులు, వేదపండితులు విశేష పూజలు జరిపారు. అనంతరం అశ్వవాహనసేవను మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రాంగణంలో ఉత్సవం నిర్వహించారు.

అమ్మవారి నిజరూప దర్శనం: ఉగాది మహోత్సవాల్లో భాగంగా చివరిరోజు అమ్మవారు భ్రమరాంబదేవి నిజరూప అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అష్టభుజాలు కలిగిన ఈ దేవి శూలం, బాకు, గద, ఖడ్గం, విల్లు, డాలు, పరిగ మొదలైన ఆయుధాలను ధరించి జగన్మాతగా దర్శనమిచ్చారు. ప్రత్యేక పూజల అనంతరం ఉత్సవమూర్తులకు ప్రాకారోత్సవం నిర్వహించారు.





స్వామివారి విగ్రహానికి చక్రస్నానం



ధ్వజస్తంభానికి హారతులు

నేటి నుంచి ఇంటర్ తరగతులు

నంద్యాల ఎడ్యుకేషన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ 2025-26 విద్యాసంవత్సరం ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ప్రారంభమవుతోంది. ఈ సందర్భంగా డీఐఈవో సునీత మాట్లాడుతూ ఒకటో తేదీ నుంచి ఇంటర్ విద్యార్థులకు తరగతులు ప్రారంభమవుతాయన్నారు. 7వ తేదీ నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం అడ్మిషన్లు ప్రారంభిస్తామన్నారు. ఏప్రిల్ 23వ తేదీ వరకు తరగతులు నిర్వహించి 24 నుంచి సెలవులు ప్రకటించడం జరుగుతుందన్నారు. మళ్లీ జూన్ 1వ తేదీన కళాశాలలు పునః ప్రారంభమవుతాయన్నారు. కళాశాలలు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు తరగతులు ఉంటాయని, ప్రతిరోజు 7-8 పీరియడ్లు ఉండేలా టైం టేబుల్‌ను అమలు చేయడం జరుగుతుందన్నారు. సబ్జెక్టు కోర్సులలో కీలక మార్పులు చేయడం జరిగిందని, ఎంపీసీ గ్రూపులో మ్యాథ్స్ ఏ, బీ రెండు పేపర్లకు బదులుగా ఒకే పేపర్ ఉంటుందన్నారు. అలాగే బైపీసీలో బాటనీ, జువాలజీ కలిపి బయాలజీగా ఒకే పేపర్ ఉంటుందన్నారు. సైన్స్‌లో 6 పేపర్ల నుంచి 5 పేపర్లకు తగ్గుతుందన్నారు. ఇంగ్లీష్ తప్పనిసరని, వారి ప్రధాన సబ్జెక్టుతో పాటు అదనంగా మరో సబ్జెక్టు ఎంపిక చేసుకోవచ్చని తెలిపారు. ఎంపీసీ విద్యార్థులు ఇంగ్లీష్‌తో పాటు బయాలజీని, బైపీసీ విద్యార్థులు ఇంగ్లీష్‌తో పాటు మ్యాథ్స్‌ని అదనపు సబ్జెక్టుగా ఎంపిక చేసుకోవచ్చని వివరించారు.

సంగమేశ్వరుడిని దర్శించుకున్న లోకాయుక్త



సంగమేశ్వరంలో లోకాయుక్త దంపతులకు పూర్ణకుంభ స్వాగతం

కొత్తపల్లి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణాతీరం నుంచి ఇటీవల బయల్పడిన సప్తనదుల సంగమేశ్వరున్ని కర్నూలు లోకాయుక్త జస్టిస్ రజిని దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం సంగమేశ్వరున్ని దర్శించుకునేందుకు వచ్చిన జడ్జి దంపతులకు ఆలయ పురోహితుడు తెలకపల్లి రఘురామశర్మ ఘనంగా పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం వారికి క్షేత్ర సన్నిధిలోని లలితా సంగమేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేసి సంగమేశ్వర స్వామి ఆలయ చరిత్ర గురించి జడ్జి దంపతులకు పురోహితులు వివరించారు. అనంతరం జస్టిస్ దంపతులు కొలనుభారతి అమ్మవారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ పురోహితులు అమ్మవారి జ్ఞాపికను, శేషవస్త్రం అందజేశారు.

ధాన్యం కొనుగోళ్లతో దళారులకు చెక్



కర్నూలు యార్డులో ధాన్యం కొనుగోళ్లు చేయనున్న ప్రదేశం

కర్నూలు అగ్రికల్చర్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో 15 మార్కెట్ యార్డులు ఉన్నా ఇప్పటి దాకా జిల్లాలో ప్రధానంగా సాగయ్యే ధాన్యం పంట ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు ఏ మార్కెట్ కమిటీ చర్యలు చేపట్టలేదు. దీనివల్ల దళారులు తాము చెప్పిందే ధర అంటూ రైతులను దోచేశారు. ఇటీవల కర్నూలు మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి, అసిస్టెంట్ సెక్రటరీ వెంకటేశ్వర్లు మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులను స్థానిక మంత్రి టీజీ భరత్‌తో పాటు ప్రజాప్రతినిధులను కలిసి కర్నూలు మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోళ్లకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో ఎక్కడా ధాన్యం కొనుగోల్లు లేకపోవడం వల్ల రైతులు మిల్లర్లను బతిమాలి వారు చెప్పిన చోటుకు ధాన్యాన్ని తీసుకెళ్లి తక్కువ ధరకే అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కర్నూలు మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోలు ఏప్రిల్ 1వ తేదీ నుంచి అధికారికంగా ప్రారంభం అవుతుండటంతో రైతుల సంతోషానికి అవధుల్లేకుండా పోయాయి. ప్రభుత్వం క్వింటం ధాన్యానికి మద్దతు ధరను రూ.2,300 ప్రకటించింది మార్కెట్ కమిటీ అధికారులు నాణ్యత గలిగిన ధాన్యానికి రైతులకు ఈ ధరను అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో కేసీ కెనాల్, తెలుగుగంగ, ఎస్సార్బీసీ, ఎల్లెల్సీ, గాజులదిన్నె తదితర ప్రధాన రిజర్వాయర్లు, కాలువల ద్వారా ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో 2 లక్షల ఎకరాల్లో ధాన్యాన్ని పండిస్తున్నారు. కర్నూలులో ధాన్యం కొనుగోలు ప్రారంభిస్తే ఈ రైతులందరికీ ప్రయోజనం చేకూరే అవకాశం ఏర్పడింది.

ధాన్యాన్ని కర్నూలు యార్డుకు తీసుకురావాలి



కర్నూలు మార్కెట్ యార్డులో అధికారులు, ప్రజాప్రతినిధులు మంత్రి టీజీ భరత్ సహాయ సహకారాలతో రైతులు పండించిన ధాన్యాన్ని కర్నూలు మార్కెట్ యార్డులో మిల్లర్ల చేత కొనుగోలు చేయించేందుకు నిర్ణయించాం. ఇప్పటికే మార్కెటింగ్ శాఖ రీజనల్ డైరెక్టర్ కమిటీ చైర్పర్సన్ రామాంజనేయులు లాంఛనంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఏప్రిల్ 1 నుంచి కర్నూలు మార్కెట్ యార్డులో రైతులు తెచ్చిన ధాన్యాన్ని మిల్లర్లతో కొనుగోలు చేయించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. రైతులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని ప్రయోజనం పొందాలి.

- జయలక్ష్మి, సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ, కర్నూలు మార్కెట్ యార్డు

రూ.71.47 కోట్ల పన్నుల వసూళ్లు

- ఈ స్థాయిలో ఇదే తొలిసారి
- నగర ప్రజల సహకారానికి ప్రత్యేక కృతజ్ఞతలు
- నగర పాలక మేనేజర్ ఎన్. చిన్నరాముడు

కర్నూలు న్యూసిటీ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): నగరాభివృద్ధికి పన్నులు చెల్లించి సహకరించాలనే నగరపాలక సంస్థ పిలుపునకు స్పందించి రూ.71.47 కోట్ల పన్నులు చెల్లించి సహకరించిన నగర ప్రజలకు నగర పాలక మేనేజర్ ఎన్. చిన్నరాముడు, ఆర్వో ఇజ్రాయేలు కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం నగర పాలక కార్యాలయంలోని పన్ను వసూలు కేంద్రంతో పాటు సీ. క్యాంపు, బాలాజీనగర్, కల్లూరు వార్డు కార్యాలయాల్లో ఉన్న ప్రత్యేక కౌంటర్లను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఎప్పుడూ లేనంతగా రూ.71.47 కోట్లు సోమవారం సాయంత్రానికి ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులు వసూలు కావడం నగర పాలక యంత్రాంగానికి సరికొత్త ఉత్సాహాన్ని నింపిందన్నారు. అలాగే తాగునీటి కొళాయి చార్జీలు రూ.7.76 కోట్లు వసూలయ్యాయని అన్నారు.

కరువు కాలంలో ఉపశమనం..!

(5వ పేజీ తరువాయి)

నంద్యాల జిల్లాలో కూడా పలు మండలాల్లో ఈ ఏడాది రబీ సీజన్‌లో తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్నాయి. కేసీ కెనాల్, ఎస్సార్బీసీ, తెలుగుగంగ, గాలేరు నగరి కాలువల కింద సాగునీటి వసతి ఉన్న మండలాలు కాకుండా ఇతర మండలాల్లో కరువు తీవ్రత అధికంగానే ఉంది. అయితే.. తీవ్ర కరువు మండలాల జాబితాలో కొలిమిగుండ్ల మండలాన్ని మాత్రమే ఎంపిక చేశారు. సాధారణ కరువు మండలాలుగా బేతంచర్ల, బనగానపల్లె, సంజామల, ఉయ్యాలవాడ మండలాలు ఎంపిక చేశారు. డోన్, బనగానపల్లె నియోజకవర్గాల్లో వర్షాధారంగా జీవనం సాగించే మండలాల్లో కరువు పరిస్థితులు ఉన్నాయని, వాటిని కూడా ఎంపిక చేయాలని రైతులు కోరుతున్నారు.

జిల్లాల వాజులీగా కరువు మండలాలు

వివరాలు	కర్నూలు	నంద్యాల
తీవ్రమైన కరువు మండలాలు	9	1
సాధారణ కరువు మండలాలు	1	4
మొత్తం	10	5

కరువు రైతులకు ప్రయోజనం

కరువు మండలాలుగా ఎంపికైన మండలాల్లో ఉపాధి పనులు గరిష్ఠంగా 150 రోజులు పనిదినాలు కల్పిస్తారు. ఒక్కో కుటుంబానికి గరిష్ఠంగా రూ.13,660 అదనపు ప్రయోజనం కలుగుతుంది. వాతావరణ ఆధారిత పంటల బీమా ప్రయోజనం లభిస్తుంది. పంట రుణాలు రీషెడ్యూల్ చేస్తారు. వేసవిలో తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టడమే కాకుండా ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుంది. కరువు నివారణ పంటల సాగుపై ప్రోత్సాహం అందిస్తారు. ఆహార భద్రత కల్పిస్తారు. స్కేల్ ఆఫ్ రిలీఫ్ నిబంధనలు ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంట నష్ట పరిహారం అందిస్తారు.

ప్రేమ కోసం పిడకల సమరం



ఆస్పరి మండలం కైరుప్పల గ్రామంలో పిడకలతో కొట్టుకుంటున్న గ్రామస్థులు

- 30 నిమిషాల పోరాటం
- సమరంలో 45 మందికి పైగా స్వల్ప గాయాలు
- కర్నూలు జిల్లాలో ఏళ్ల తరబడి వినూత్న ఆచారం

ఆస్పరి మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఆస్పరి మండలంలో ప్రతి ఏటా ఓ సంబరం సంభ్రమాశ్చర్యాలకు గురిచేస్తుంది. కైరుప్పల గ్రామంలో రెండు వర్గాలు ఒకరిపై ఒకరు పిడకలతో కొట్టుకుంటూ తమ భక్తిని చాటుకోవడం ఇక్కడి ప్రత్యేకత. కైరుప్పల గ్రామంలో భద్రకాళి దేవి, వీరభద్ర స్వామి ఆలయానికి కొన్ని వందల సంవత్సరాల చరిత్ర ఉంది. పిడకల సమరం సోమవారం వేలాది మంది జన సమక్షంలో ఉత్కంఠ భరితంగా సాగింది. ఈ సమరంలో 45 మందిపైగా స్వల్పంగా గాయపడ్డారు. సంప్రదాయం ప్రకారం కారుమంచి నుంచి పెద్దరెడ్డి వంశస్థుడైన నందకిశోర్ రెడ్డి గుర్రంపై మందీ మార్బలం, మేళతాళాలతో కైరుప్పలకు వచ్చి ఆలయంలోకి వెళ్లి పూజలు చేసి వెనుతిరగగానే ఈ పిడకల సమరం మొదలైంది. ఈ సందర్భంగా వీరభద్రస్వామి, కాళికాదేవి వర్గీయులుగా గ్రామస్థులు విడిపోయారు. పరస్పరం పిడకలతో దాడి చేసుకున్నారు. వందల సంఖ్యలో పిడకలు గాల్లోకి లేచి ప్రత్యర్థి వర్గంపై పడుతుంటే ఉత్సాహం రెట్టింపైంది. పిడకల దుమ్ము ఆకాశాన్నంటింది. తమను తాము రక్షించుకుంటూ ఎదుటి వారిపై పిడకలు విసురుకుంటూ గుంపులుగా ప్రజలు కదిలారు. ఓసారి ఒక వర్గం వారిది పైచేయి అయితే, ఇంకోసారి మరో వర్గం వారిది పైచేయిగా నిలిచింది. తమవర్గం వారు గెలవాలనే తపనతో మహిళలు పిడకలు అందిస్తూ సాయంగా నిలిచారు. ఒక చోట కుప్పగా వేసిన పిడకలు అయిపోయేంత వరకు అరగంట పాటు ఈ సమరం కొనసాగింది. దెబ్బలు తగిలిన వారు స్వామి వారి విభూది రాసుకున్నారు. మూడు రోజుల్లో ఆ గాయం నయమవుతుందన్న ప్రగాఢ నమ్మకం వారిది. ఈ సమరం ముగిసిన తర్వాత గ్రామపెద్దలు పంచాయితీ చేసి కాళికాదేవి, వీరభద్రస్వామి వారి వివాహానికి అంగీకారం తెలిపారు. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు కైరుప్పల చుట్టుపక్కల గ్రామాల పుప్పాలదొడ్డి, వెంగళాయదొడ్డి, కారుమంచి, కల్లపర్రి, పుటకలమర్రి, అలారుదిన్నె, బిల్లేకల్లు, చెన్నంపల్లి, వలగొండ, ఆస్పరితో పాటు తెలంగాణా, కర్ణాటక, తమిళనాడు నుంచి వేలాది మంది ప్రజలు తరలివచ్చారు. ఇదిలా ఉండగా పిడకల సమరానికి డీఎస్పీ వెంకటరామయ్య, ఆస్పరి సీఐ మస్తాన్‌వలి ఆధ్వర్యంలో ముగ్గురు ఎస్ఐలు, 60 మంది పోలీసులతో భారీ బందోబస్తు నిర్వహించారు.

ప్రచారంలో ప్రేమ కథ

ఉగాది సమయంలో ఇక్కడ జరిగే పిడకల సమరం వెనుక ఆసక్తికర కథనం ప్రచారంలో ఉంది. త్రేతాయుగంలో భద్రకాళి దేవి, వీరభద్ర స్వామి ప్రేమికులు. వారి మధ్య ప్రేమ వ్యవహారం కాస్త గొడవకు దారితీస్తుంది. పెళ్లి విషయంలో వీరభద్రస్వామి కొంత ఆలస్యం చేస్తారు. దీంతో ప్రేమించి పెళ్లి చేసుకోకుండా. తమ భద్రకాళి దేవిని వీరభద్ర స్వామి మోసం చేశారని అమ్మవారి తరపు భక్తులు నమ్మి వీరభద్ర స్వామిని ఆవు పేడతో తయారు చేసిన పిడకలతో కొట్టి అవమానించాలని చూస్తారు. ఈ విషయం తెలుసుకొన్న వీరభద్ర స్వామి భక్తులు, అమ్మవారు ఉండే ఆలయం వైపు వీరభద్ర స్వామిని వెళ్లవద్దని వేడుకున్నారు. అయినా స్వామివారు ఆలయం వైపు వెళ్లారని, అప్పుడు అమ్మవారి భక్తులు ముందుగా వేసుకున్న ప్రణాళికలో భాగంగా వీరభద్ర స్వామి వారిపై పిడకలతో దాడి చేశారని ఇక్కడి ప్రజల కథనం.



దాడులు చేసుకునేందుకు సిద్ధంగా ఉంచిన పిడకలు



పిడకల సమరాన్ని చూసేందుకు వేలాదిగా తరలివచ్చిన ప్రజలు

గాయమైనా..మూడు రోజుల్లో నయమవుతుంది

పిడకల సమరంలో గాయాలవుతాయి. గాయమైన చోట స్వామివారి విభూతి రాసుకుంటే మూడు రోజుల్లో ఆ గాయం కనబడదు. ఎలాంటి నొప్పి ఉండదు. గాయమైనప్పుడు మాత్రమే నొప్పి ఉంటుందేమో కానీ ఆ తర్వాత ఎలాంటి నొప్పి ఉండదు.

- పవన్ కళ్యాణ్, కైరుప్పల

గాయాలైనా ఏమీ కాదు

పిడకల సమరంలో గాయాలు తగులుతుంటాయి. దెబ్బలు తగిలిన ఎలాంటి ఇబ్బంది ఉండదు. గాయమైన వెంటనే దేవాలయంలోకి వెళ్లి అక్కడ ఉన్న బండారు గాయమైన ప్రదేశంలో రాసుకుంటాము. నొప్పి అనేది ఉండదు. మూడు రోజుల్లో గాయమైన చోట కనీసం మచ్చ కూడా ఉండదు.

- రమేష్, కైరుప్పల

శతాబ్ది బ్రహ్మోత్సవాలకు ప్రముఖులకు ఆహ్వానం



మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న రామాలయం కమిటీ సభ్యులు

కర్నూలు కల్చరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పాతనగరంలోని పేట శ్రీరామాలయంలో ఏప్రిల్ 12 నుంచి 18 వరకు నిర్వహిస్తున్న ఆలయ శతాబ్ది బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చిల్కూరు ప్రభాకర్ తదితరులు పలువురు ప్రముఖులకు ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఆదివారం కమిటీ బృందం తొలుత రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌ను మౌర్యఇన్‌లోని ఆయన కార్యాలయంలో కలిశారు. బ్రహ్మోత్సవాలకు రావాలని మంత్రిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి బ్రహ్మోత్సవ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ సుమారు 200 ఏళ్లకు పైగా చరిత్ర ఉన్న పేట శ్రీ రామాలయంలో గత తొంబై తొమ్మిది ఏళ్లుగా బ్రహ్మోత్సవాలు కొనసాగాయిని, ఈ ఏడాది అత్యంత వైభవంగా శతాబ్ది బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నామని వివరించారు. అనంతరం వారు రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్‌ను, కర్నూలు పార్లమెంటు సభ్యులు బస్తిపాటి నాగరాజులను కలిసి బ్రహ్మోత్సవాల్లో పాల్గొనాలని ఆహ్వానించారు.

నంద్యాలలో భారీ చోరీ

- 6 తులాల బంగారు నగలు, అర్ధ కేజీ వెండి, రూ.5.30 లక్షల అపహరణ
- సీసీ కెమెరాల్లో నమోదైన దొంగతనం దృశ్యాలు
- ఆధారాలు సేకరించిన క్లూస్ టీం



చెల్లాచెదరుగా పడేసిన వస్తువులు

నంద్యాల క్రైం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణం క్రాంతినగర్‌లోని టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సుభాన్ ఇంట్లో దొంగలు భారీఎత్తున చోరీ చేశారు. నంద్యాల రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ గంగయ్య యాదవ్ వివరాలివీ.. టైలర్స్ అసోసియేషన్ నంద్యాల శాఖ అధ్యక్షుడు సుభాన్, అతడి కుటుంబ సభ్యులు కోడలి కాన్పు కోసం రెండు రోజుల క్రితం హైదరాబాద్‌కు వెళ్లారు. దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టి ఇంట్లోని బీరువా తాళాలను కూడా పగులగొట్టి అందులో ఉన్న 6తులాల బంగారు నగలు, అర్ధకేజీ వెండితోపాటు రూ.5.30లక్షలను ఎత్తుకెళ్లారు. చోరీ చేసిన వైనం పూర్తిగా సీసీ కెమెరాల్లో నమోదు అయింది. ఇంటి యజమాని సుభాన్ వెంటనే జరిగిన విషయాన్ని నంద్యాల తాలుకా పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్ఐ గంగయ్య యాదవ్ నేతృత్వంలో పోలీసులు రంగప్రవేశం చేసి క్లూస్ టీంతో క్షుణ్ణంగా పరిశీలించి ఆధారాలు సేకరించారు. చోరీకి పాల్పడింది చెంచు గ్యాంగ్ పనేనని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

3న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

కర్నూలు స్పోర్ట్స్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): చౌడేశ్వరి దేవి జ్యోతి మహోత్సవం సందర్భంగా బనగానపల్లె మండలం నందవరం గ్రామంలో ఏప్రిల్ 3న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు రమణారెడ్డి, శివశంకర్ రెడ్డి తెలిపారు. విజేతలకు వరుసగా రూ.25వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.7వేలు, రూ.5వేలు, రూ.3వేలు, నగదు బహుమతులు కల్పించారన్నారు. ప్రవేశ రుసుం రూ.400లు 2వ తేదీలోపు చెల్లించాలన్నారు. జడ్పీహెచ్ఎస్ నందవరం క్రీడామైదానంలో పోటీలు జరిగే తెలిపారు. దాతలు పి.నాగార్జున రెడ్డి, శుభాకర్ రెడ్డి, నాగశిధర్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేస్తారన్నారు. వివరాల కోసం 9010958141, 9493421978, 9492613805లను సంప్రదించాలన్నారు.

మహిళ ఆత్మహత్య

భర్త మద్యానికి బానిసయ్యాడన్న మనస్తాపంతో..

మహానంది, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): భర్త మద్యానికి బానిసై మానుకోకపోవడంతో మనస్తాపానికి గురైన వెంకటలక్ష్మమ్మ(48) విష ద్రావణం తాగి ఆత్మహత్య చేసుకున్నారు. మహానంది ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపిన వివరాలివీ.. మండలంలోని ఎం.తిమ్మాపురం గ్రామానికి చెందిన చిన్న వెంకటేశ్వర్లు, వెంకటలక్ష్మమ్మ భార్యాభర్తలు. మద్యాం తాగడం మానుకోవాలని మహిళ తన భర్తను పలుమార్లు కోరింది. అయినా అతడు వినకపోవడంతో మనస్తాపానికి గురైన మహిళ ఆదివారం రాత్రి విష ద్రావణాన్ని తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందింది. సోమవారం కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇదో రకం వసూలు..!

- ఈకేవైసీ కోసం బలవంతపు వసూళ్లు
- ప్రతి ఈకేవైసీకి రూ. 50ల డిమాండ్



కర్నూలులో లబ్ధిదారు నుంచి డబ్బులు వసూలు చేస్తున్న డీలర్‌కు సంబంధించిన వ్యక్తి



చౌక దుకాణం

కర్నూలు కలెక్టరేట్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): జిల్లా సివిల్ సప్లయ్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా జిల్లాలోని ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారు. కేంద్ర ఆదేశాలనుసారం రేషన్‌కార్డులోని ప్రతి సభ్యుడు ఈకేవైసీ ఉండాలి. ఈ మేరకు జిల్లాలోని ఈకేవైసీ పెండింగ్‌లో ఉన్న రేషన్ కార్డులోని సభ్యుడు ఈకేవైసీ తప్పనిసరిగా చేయాలి. అందుకు ఏప్రిల్ 30వ తేదీలోపు ఈకేవైసీ చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో 6,71,086 కార్డుదారులు, చౌకదుకాణాలు 1,233, ఎండీయూ వాహనాలు 275 ఉన్నాయి. జిల్లాలోని కొంత మంది రేషన్ డీలర్లు, ఎండీయూలు ఈకేవైసీ పూర్తికాని వారితో రూ.50 దాకా వసూలు చేస్తున్నారు. వీరిపై అధికారులకు ఫిర్యాదు చేస్తే దాడులు చేయడానికి కూడా వెనుకాడటం లేదు. 'మీరు మాపై అధికారులకు ఎవరికైనా ఫిర్యాదు చేసినా కూడా మాకు ఎటువంటి ఇబ్బంది లేదు' అంటూ కొందరు రేషన్ డీలర్లు బహిరంగంగా చెబుతున్నారు.

ప్రచారం శూన్యం

జిల్లాలోని డివిజన్ స్థాయిలో ఎండీయూ, రేషన్ డీలర్లతో సివిల్ సప్లైస్ అధికారులు సమావేశాలు నిర్వహించడం లేదని విమర్శలు న్నాయి. ఈకేవైసీ పూర్తి చేయని వారి సంబంధిత లిస్టును వార్డు, గ్రామ సచివాలయ అధికారులకు పంపించారు. గ్రామ పట్టణాల్లో ఎంతో మంది చదువుకుని నిరక్షరాస్యులుగా ఉన్నారు. మరికొందరు విభిన్న ప్రతిభావంతులు ఉన్నారు. అలాంటి వారికి ఈకేవైసీపై అవగాహన లేదు. దీంతో వీరు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు.

ఈకేవైసీ పూర్తిగా ఉచితం



జిల్లాలో ఈకేవైసీ పూర్తి చేయని వారు ఏప్రిల్ 30లోపు చేయాలి. డీలర్లు, ఎండీయూలు రుసుం వసూలు చేయకూడదు. ఇది పూర్తిగా ఉచితం. ఎవరికైనా ఆలా రేషన్‌కార్డు సభ్యుల నుంచి డబ్బు వసూలు చేసినట్లు ఫిర్యాదులు వచ్చినట్లయితే వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటాం.

- రాజారఘువీర్, డీఎస్‌వో

డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచాం: ఎస్పీ

నంద్యాల క్రైం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రంజాన్ పర్వదినం ప్రత్యేక ప్రార్థనల నేపథ్యంలో సోమవారం పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా తెలిపారు. ఉపవాస దీక్షల అనంతరం రంజాన్ పర్వదినాన ప్రత్యేక ప్రార్థనల కోసం వేలాదిమంది ముస్లింలు ఈద్గాలు, మస్జిద్‌లకు తరలివెళ్లారు. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఆయా ఈద్గాలు, మస్జిద్‌లవద్ద ప్రత్యేక బందోబస్తుతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. రంజాన్ పవిత్ర మాసంలో ముస్లిం సోదరులు ఉపవాసంతో అత్యంత భక్తిశ్రద్ధలతో అల్లాహ్‌కు ప్రార్థన చేస్తారన్నారు. ప్రత్యేక ప్రార్థనల సందర్భంగా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నట్లు ఎస్పీ వెల్లడించారు. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చర్యలు చేపట్టారు.

'పంటలను కాపాడుతాం'


రైతులతో మాట్లాడుతున్న రామలింగారెడ్డి

బండిఆత్మకూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): తెలుగుగంగ కింద సాగు చేసిన వరి పంటను కాపాడతామని కేసీ కెనాల్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ బన్నూరు రామలింగారెడ్డి, తెలుగుగంగ ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ కంచర్ల మనోహర్ చౌదరి సూచించారు. మండలంలోని కృష్ణనంది నుంచి నారాయణపురం వరకు గంగ కాలువలో నీటి ప్రవాహాన్ని సోమవారం వారు రైతులతో కలసి పరిశీలించారు. వారు మాట్లాడుతూ ప్రస్తుతం సుమారు 800 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంద ని, ఎక్కడ పంటలు ఎండిపోకుండా సకాలంలో పొలాలకు నీరు అందిస్తామని, రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వారు పేర్కొన్నారు. వెంట ఈఈ శంకర్‌రెడ్డి, ఏఈ శివనాయక్, రామచంద్రుడు, ఆంబ్రోస్, శంకర్ పాల్గొన్నారు.

బండలాగుడు పోటీల్లో కర్ణాటక ఎద్దుల విజయం

పగిడ్యాల, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఉగాది పండుగ సందర్భంగా లక్ష్మాపురం గ్రామంలో సోమవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎద్దుల బండలాగుడు పోటీలలో కర్ణాటక రాష్ట్రం బిజినిగిరికి చెందిన ఎద్దులు మొదటి స్థానంలో నిలిచాయి. క్రిష్ణగిరి మండలం పందిర్లపల్లెకు చెందిన చందు, బేతంచర్ల మండలం ముసాయచెరువు గ్రామానికి చెందిన వెంకటేశ్వరరెడ్డి ఎద్దులు రెండో స్థానంలో నిలిచాయి. చిక్కేపల్లె గ్రామానికి చెందిన రమాదేవి యాదవ్ ఎద్దులు మూడో స్థానంలో నిలిచాయి. బెళగల్ మండలం యనగండ్ల గ్రామానికి చెందిన భద్ర విజయభాస్కర్ ఎద్దులు నాలుగో స్థానంలో గెలుపొందాయి. మొదటి నాలుగు నగదు బహుమతులు రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు మద్దిలేటి గౌడ్, భూషిగౌడ్, గోవింద్, షమిన్, అయ్యన్న తదితరులు ఉన్నారు.

నేటి నుంచి ప్రభుత్వ భూముల సర్వే

- సమావేశంలో అధికారుల వెల్లడి


ఆర్డీవో ఆధ్వర్యంలో సమావేశమైన అధికారులు

సున్నిపెంట, మార్చి 31(ఆంధ్రజ్యోతి): సున్నిపెంట గ్రామంలోని ప్రభుత్వ భూములను మంగళవారం నుంచి సర్వే చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సర్వే నిర్వహించేందుకు సోమవారం నంద్యాల ఆర్డీవో నాగజ్యోతి ఆధ్వర్యంలో సున్నిపెంటలోని తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. శ్రీశైల దేవస్థానం ఈవో ఎం.శ్రీనివాసరావు, తహసీల్దార్ శ్రీనివాసులు, శ్రీశైలం ఫారెస్టు రేంజర్ సుభాష్‌రెడ్డి, నీటిపారుదల శాఖ ఎస్ఈ శ్రీరామచంద్రమూర్తి, జిల్లా సర్వే, ల్యాండ్స్ అధికారి రవీంద్రపాల్ పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ టూరిజం శాఖ సున్నిపెంటలో 50 ఎకరాల స్థలం కేటాయించాలని ప్రభుత్వాన్ని అభ్యర్థిం చింది. దీనితో ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం ఆర్డీవో ఆధ్వర్యంలో అధికారులు సమావేశమయ్యారు. నాలుగు బృందాలు సర్వే చేపట్టనున్నాయి.

మూల పెద్దమ్మ బ్రహ్మోత్సవాలు ప్రారంభం


అమ్మవారికి బోనాలు తీసుకెళ్తున్న వాల్మీకులు

గడివేముల, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మూల పెద్దమ్మ బ్రహ్మోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి ఆలయ అర్చకులు కుంకుమార్చన, ఆకు పూజలు నిర్వహించారు. భక్తులు పుట్ట మన్నుకు వెళ్లి అమ్మవారికి ఘటానికి వెళ్లారు. సాయంకాలం వాల్మీకులు తమ ఇంటి నుంచి మంగళవాయిద్యాలతో అమ్మవారికి బోనాలు సమర్పించారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారికి బియ్యం బేడలు, సారెలు సమర్పించి పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా గడివేములలో సందడి వాతావరణం నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అంగళ్లు, రంగుల రాట్నాల వద్ద సందడి చేశారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా అవాంఛనీయ ఘటనలు జరగకుండా పాణ్యం సీఐ కిరణ్ కుమార్‌రెడ్డి ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులకు అసౌకర్యాలు కలగకుండా ఆలయ ఈవో రామలింగారెడ్డి, ఫెస్టివల్ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

- అమ్మవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా మండల కేంద్రంలోని మూల పెద్దమ్మకు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, టీడీపీ నందికొట్కూరు నియోజకవర్గ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈవో రామలింగారెడ్డి, ఫెస్టివల్ కమిటీ సభ్యులు గౌరు దంపతులకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. టీడీపీ మండల కన్వీనర్ దేశం సత్యనారాయణరెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, నరేంద్రారెడ్డి, రమణారెడ్డి, రఫీక్, వడ్డు లక్ష్మీదేవి, సుభద్రమ్మ, సర్పంచ్ అనసూయమ్మ, శ్రీనివాసులు, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.


అమ్మవారిని దర్శించుకుంటున్న గౌరు దంపతులు

ఘనంగా రంజాన్

- ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు
- మహమ్మద్ ప్రవక్త సందేశాన్ని వినిపించిన మత పెద్దలు
- ఆనందోత్సాహాలతో పండుగ నిర్వహించుకున్న ముస్లింలు


ఆత్మకూరులోని పెద్ద మసీద్‌లో ప్రార్థన చేస్తున్న ముస్లింలు

ఆత్మకూరు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలో సోమవారం రంజాన్ పర్వదిన వేడుకలను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు మసీదులు, ఈద్గాల వద్ద ప్రార్థనలు చేశారు. ఆయా మసీదుల్లో మతపెద్దలు రంజాన్ సందేశాన్ని జనులకు వినిపించి అందులోని మంచి విషయాలకు వెల్లడించారు. పట్టణంలోని నంద్యాల టర్నింగ్‌లో సీపీఎం తరుపున ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసి ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.

ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే బుడ్డా

రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. స్థానిక నంద్యాల టర్నింగ్ వద్ద ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసి ముస్లింలను ఆత్మీయంగా ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలిపారు. ముస్లింలు పెద్దఎత్తున తరలివచ్చి ఎమ్మెల్యే బుడ్డాకు ఆత్మీయంగా పలుకరించి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ నియోజకవర్గం కన్వీనర్ మోమిన్ షబాన, మున్సిపల్ మాజీ చైర్మన్ శివపురం నూర్‌మహ్మద్, కోఆప్షన్ సభ్యుడు ఎంఎ రషీద్ ఎమ్మెల్యే బుడ్డాను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ మండల, పట్టణాధ్యక్షులు శివప్రసాద్‌రెడ్డి, వేణుగోపాల్, నాయకులు యుగంధర్ రెడ్డి, కలీముల్లా, అబ్దుల్లాపురం బాషా, నబీరసూల్, మోహబతుల్లా, షాబుద్దీన్, వెన్నా శ్రీధర్‌రెడ్డి, రామ్మూర్తి, నాగూర్ తదితరులు ఉన్నారు.

ఆత్మకూరు రూరల్: పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని మండలంలోని ఆయా గ్రామాలలోని మసీదులలో, ఈద్గాలలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

వెలుగోడు: మండలంలో రంజాన్ పండుగను ముస్లింలు ఘనంగా నిర్వహించుకున్నారు. ప్రతి ఒక్కరూకలసి మెలసి ఉండాలని, చెడు వ్యసనాలను వదిలి సన్మార్గంలో నడవాలని మత పెద్దలు పిలుపునిచ్చారు.

బండిఆత్మకూరు: మండలంలోని పలు గ్రామాల్లో ముస్లీంలు రంజాన్ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ముస్లిలు పేదలకు దాన ధర్మాలు చేశారు.


వెలుగోడులో..


నందికొట్కూరులో ప్రార్థన చేస్తున్న ముస్లింలు


ఆత్మకూరలోఓ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి శుభాకాంక్షలు తెలియజేస్తున్న బీజేపీ నాయకురాలు మోమిన్ షబానా

నందికొట్కూరు: పట్టణలోని ఈద్గాల వద్ద ప్రార్థనలు చేశారు. కార్యక్రమాల్లో రబ్బాని గ్రూప్ అధినేత ముస్లిం మైనార్టీ సీనియర్ నేత ఆల్-హాజ్-హాజీ మహబూబ్ సాహెబ్, మున్సిపల్ వైస్ చైర్మన్ రబ్బాని, కౌన్సిలర్ జాకీర్, అబ్దుల్ సూకూర్ పాల్గొన్నారు.

- ఎమ్మెల్యే జయసూర్య మాట్లాడుతూ రంజాన్ అంటే ప్రేమ, మానవత్వం, త్యాగానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, జాకీర్, ముర్తుజావళి, జమీల్, తదితరులు పాల్గొన్నారు.

పగిడ్యాల: మండలంలో రంజాన్ వేడుకలు నిర్వహించారు. ఈద్గాల వద్ద ముస్లింలు నమాజ్ చేశారు. ఇమాంములు రంజాన్ ప్రాముఖ్యతను వివరించారు. నెహ్రూనగర్ గ్రామంలో ముస్లింలు నమాజ్ చేసుకునేందుకు ఈద్గా లేకపోవడంతో ఇబ్బందులు పడాల్సివస్తుందని ముస్లీం పెద్దలు ఫరూక్, షరీఫ్ ఆవేదన వ్యక్తం చేశారు. రంజాన్ సందర్భంగా నమాజ్ చేసుకునేందుకు ఈద్గా లేకపోవడంతో సమీపం లోని పంట పొలాల్లో నమాజ్ చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొందని అన్నారు.

కొత్తపల్లి: దుద్యాల, శివపురం, ముసలిమడుగు, కొత్తపల్లి, నందికుంట, కొక్కెరంచ ఎదురుపాడు తదితర గ్రామాల్లో ముస్లీంలు రంజాన్ వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. మసీదులు, ఈద్గాలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

పాములపాడు: మండలంలోని అన్ని గ్రామాలలో ముస్లిం సోదరులు రంజాన్ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. మత గురువులు బోధనలు చేశారు.

జూపాడుబంగ్లా: మండలంలో రంజాన్ పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. నెలరోజులపాటు ఉపవాసదీక్షలు ముగించుకొని అల్లానామస్మరణతో ఇంటినుంచి ఈద్గాకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పండుగ విశిష్టతను ఇమాంలు వివరించారు. అనంతరం దువాచేసుకుని ఒకరినొకలు రంజాన్ శుభాకాంక్షలు చెప్పుకొన్నారు.

మిడుతూరు: రంజాన్ పర్వదిన వేడుకలను మండంలో ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ప్రతి వ్యక్తి దానగుణం కలిగి ఉండాలని, తనకు ఉన్నదాట్లో దానం చేయడమే గొప్ప లక్ష్యంగా భగవంతుడు పేర్కొన్నారని మత గురువులు తెలిపారు.

నంద్యాల క్రైం: జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ ఈఎస్ రవికుమార్ కార్యాలయంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనలో ఎస్ఐలు బ్రహ్మయ్య, రమేష్‌బాబు, అఖిల, విశ్రాంత ఎస్ఐ ఉస్మాన్, సిబ్బంది అన్వర్‌బాషా, ఓబులేసు, యూవీ రమణ, ప్రసన్న, ప్రకాష్, పార్వతి, శాలిశా, ఖలీల్, భరత్, సిబ్బంది పాల్గొన్నారు.

గడివేముల: మండలంలోని అన్ని గ్రామాల్లో రంజాన్ పర్వదినాన్ని ముస్లింలు ఘనంగా జరుపుకొన్నారు. ఈద్గాల వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.


నందికొట్కూరులో ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డిని సన్మానిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ రబ్బాని


నంద్యాలలో..


కొత్తపల్లి: శివపురంలో..


బండిఆత్మకూరులో..


జూపాడుబంగ్లాలో..


పాములపాడులో..


గడివేములలో..


మిడుతూరులో..


పగిడ్యాల: ప్రాతకోట గ్రామంలో..

'వక్ఫ్ ఆస్తులపై ప్రభుత్వాల జోక్యం తగదు'

వెలుగోడు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ముస్లిం మైనార్టీకి చెందిన వక్ఫ్ ఆస్తులపై ప్రభుత్వాల జోక్యం తగదని ముస్లిం మత పెద్దలు అన్నారు. సోమవారం వెలుగోడులోని ప్రధాన రహదారిపై కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. కుడి చేతికి ముస్లింలు నల్ల రిబ్బన్లు కట్టుకొని ప్లకార్డులు చేతపట్టి మౌనంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లుద్వార వక్ఫ్‌బోర్డు ఆస్తులను స్వాధీనం చేసుకోవాడానికి ప్రయత్నిస్తోందని, దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. వక్ఫ్ భూములు ప్రభుత్వం ఇచ్చినది కాదని, తాము ఆక్రమించినవి కావని తరతరాలుగా వస్తున్న వారసత్వ భూములని తెలిపారు.

పాములపాడు: వక్ఫ్ బోర్డు చట్ట సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ సోమవారం పాములపాడులోని కేజీ రోడ్డుపై ముస్లింలు నిరసన వ్యక్తం చేశారు. మత గురువులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీలకు అండగా ఉండాలని, ముఖ్యమంత్రి ఈ బిల్లుకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని డిమాండ్ చేశారు. ముస్లింల పట్ల వివక్ష తగదని నల్లబ్యాడ్జీలు ధరించి స్థానిక మజీదు నుంచి బస్టాండు కూడలి వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. మత గురువులు సుబాన్, హారీఫ్, మండల మైనార్టీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మౌలా హుసేన్, కో ఆప్షన్ మెంబర్ ముర్తుజావలి తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న వక్ఫ్ సవరణ బిల్లును రద్దు చేయాలని మండల కేంద్రంలోని గాంధీ విగ్రహం వద్ద ముస్లింలు సోమవారం నల్లబ్యాడ్జీలు ధరించి శాంతియుతంగా నిరసన తెలియజేశారు. ముస్లిం పెద్దలు ఖాజా, వహీద్, బషీర్, ఇస్మాయిల్, మొల్ల బాషా, మహ్మద్ హనీఫ్, పెద్ద హుశేన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం భారత రాజ్యాంగానికి వ్యతిరేకంగా నడుస్తోందన్నారు. వక్ఫ్‌బోర్డులో ముస్లీమేతరులకలు స్థానం కల్పించడం ఒక దుశ్చర్య అన్నారు. ఎవరికి కేటాయించిన సంస్థల్లో వారు ఉంటే ఆ సంస్థలకు దేశానికి కూడా మేలు జరుగుతుందన్నారు. అలాగే పూర్వీకులు మసీదులు, ఈద్గాలు, కబ్రస్తాన్‌లు, ఇతర మదరస్సాలు వాటి సౌకర్యాలు అవసరాలు తీర్చుకోవడం కోసం భూములు దానం చేశారని అన్నారు. కార్యక్రమంలో నజీర్, షరీఫ్, మౌలాలి, సలాం, హుస్సేన్, చాంద్‌బాషా, ముర్తుజావలి, తదితరులు పాల్గొన్నారు.


వెలుగోడులో నిరసన తెలుపుతున్న ముస్లింలు

2న కలెక్టరేట్ ఎదుట నిరసన

నంద్యాల ఎడ్యుకేషన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ ఏప్రిల్ 2వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన చేపడుతున్నట్లు ఏపీ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు ప్రకటించారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో అధ్యక్షుడు శివయ్య, కార్యదర్శి అబ్దుల్ కలాం మాట్లాడుతూ సీపీఎస్, జీపీఎస్‌లను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, ప్రభుత్వం బకాయిపడ్డ మూడు డీఏలను మంజూరు చేయాలని, ఇంగ్లీష్ మాధ్యమంతో పాటు సమాంతరంగా తెలుగు, ఉర్దూ మాధ్యమాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. 2004వ సంవత్సరం కంటే ముందు ఉపాధ్యాయ వృత్తిలో చేరిన 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు కేంద్రం అమలు పరిచిన జీవో నం.57ను అమలు చేసి వారికి పాత పెన్షన్ అమలుచేయాలనే తదితర డిమాండ్లతో నిరసన చేపట్టనున్నట్లు తెలిపారు. జిల్లాలోని ప్రతి ఉపాధ్యాయుడు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళాలు

శ్రీశైలం, మార్చి 31(ఆంధ్రజ్యోతి): శ్రీశైల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి సోమవారం నంద్యాలకు చెందిన బి. రంగారెడ్డి అనే భక్తుడు రూ.1,50,000 విరాళాన్ని సహాయ కార్యనిర్వహణాధికారి జి. స్వాములుకు అందజేశారు. అదేవిదంగా కర్నూలుకు చెందిన కె. ఆర్. వరప్రసాద్‌రెడ్డి రూ.1,00,000 విరాళాన్ని సీనియర్ అసిస్టెంట్ చంద్రశేఖరరెడ్డికి అందజేశారు. దాతలకు దేవస్థానం అధికారులు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలు, స్వామి,అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు.

వైభవంగా గ్రామోత్సవం

- భక్తులతో కిటకిటలాడిన మహానంది క్షేత్రం


పల్లకిపై విహరిస్తున్న స్వామి, అమ్మవార్లు

మహానంది, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మహానందిలో సోమవారం ఉదయం కన్నడ భక్తుల కోలాహలం మధ్య ఘనంగా మహానందీశ్వరుడు, కామేశ్వరీదేవి అమ్మవార్ల ఉత్సవమూర్తుల గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ముందుగా ఆలయంలో ఈవో నల్లకాల్వ శ్రీనివాసులరెడ్డి, ఏఈవో యర్రమల్ల మధుల చేత ఉత్సవమూర్తులకు వేదపండితులు, అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పురవీధుల గుండా ప్రత్యేక వాహనంలో స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవం కన్నుల పండువగా జరిపారు.

క్షేత్రంలో భక్తుల సందడి

కన్నడ భక్తులతో జన సంద్రంగా మహానంది క్షేత్ర పురవీధులు సోమవారం నిండిపోయాయి. ఆలయ పరిసరాలు ఎటు చూసిన భక్తుల రద్దీతో కనిపించాయి. ఉగాది పర్వదినం పురష్కరించుకొని వేలాదిమంది కర్ణాటక రాష్ట్రంకు చెందిన భక్తులు వివిధ వాహనాల్లో శ్రీశైలం నుంచి మహానందికి వచ్చారు. దీంతో క్షేత్ర సమీపంలోని రెండు ప్రదేశాల్లోని 17 ఎకరాల్లో ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలాలు పూర్తిగా నిండిపోయాయి. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో మిగిలిన వాహనాలను ఆలయం ముందు వైపుకు ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సిబ్బంది మళ్లించారు. ఆది, సోమవారాల్లోనే దాదాపు లక్షమంది కర్ణాటక రాష్ట్రానికి చెందిన భక్తులు మహానందీశ్వరుడి దర్శనం కోసం తరలి వచ్చారు. రద్దీకి అనుగుణంగా ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి నిరంతరం దర్శనానికి చర్యలు తీసుకున్నారు. ఆలయ పరిసరాల్లోని పూల కోనేర్లల్లో పుణ్య స్నానాలు ఆచరించారు. కన్నడ భక్తుల కోసం దాతల సహకారంతో ఉచితంగా ఏర్పాటు చేసిన మజ్జిగ ప్యాకెట్లు, మినరల్ వాటర్ బాటిళ్లు, ప్రసాదాలను ఏఈవో యర్రమల్ల మధు పంపిణీ చేశారు. నంద్యాలకు చెందిన బళ్ళాని రమేష్, విజయ దంపతులతో పాటు రెడ్ల సమాఖ్య సంఘం ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. నంద్యాల రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసారు.

వైద్య శిబిరం: తిమ్మాపురం పీహెచ్‌సీ సిబ్బంది ఉచితంగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఆలయం ముందు భాగంలోని సుపతి మంటపం ఆవరణలో ఎంపీహెచ్‌ఈవో ఉసేన్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.


కోనేరులో పుణ్యస్నానమాచరిస్తున్న భక్తులు


అన్నదానం చేస్తున్న దాతలు

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

రామాలయంలో ప్రత్యేక పూజలు



సూర్యప్రభ వాహనంలో రాములవారు

డోన్ టౌన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): శ్రీరామ నవమి పురస్కరించుకొని పట్టణంలోని శ్రీరాముల దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు కోట్రికే హరికిషణ్ తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీరామనవమి వేడుకల సందర్భంగా ఏప్రిల్ 8 మంగళవారం వరకు ఉదయం, రాత్రి సీతారాములకు ప్రత్యేక పూజలు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో కమిటీ ఉపాధ్యక్షులు కోట్రికే సురేష్‌బాబు, డా.ఈర్లదిన్నె శ్రీధర్, కోట్రికే విష్ణుచైతన్య, కార్యదర్శులు కోట్రికే ఫణిరాజ్, చాటకొండ సాయిబాబా, నిచ్చెనమెట్ల ప్రసాద్, సభ్యులు కోట్రికే వెంకట నాగరాజు, జొన్నలగడ్డ ప్రసాద్, శివపురం ప్రసాద్, కస్తూరి రంగయ్య తెలిపారు.

సీతారాములకు విశేష పూజలు

చాగలమర్రి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవి ఉత్సవాల సందర్భంగా మండల కేంద్రంలోని కోదండరామ, పట్టాభిరామ ఆలయాల్లో సీతారాములకు విశేష పూజలు నిర్వహించారు. మహిళలు సామూహికంగా భజన కార్యక్రమాలు చేశారు. సీతారాముల ఉత్సవమూర్తులచే పల్లకి ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు



బండను లాగుతున్న ఎద్దులు

రుద్రవరం, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీరంగాపురం పోలేరమ్మ అమ్మవారి జాతర సందర్భంగా సోమవారం ఆరుపండ్ల ఎద్దుల విభాగంలో బండలాగుడు పోటీలు హోరాహోరీగా కొనసాగాయి. ఈ పోటీలకు ఏపీ, తెలంగాణ నుంచి తొమ్మిది జతల ఎడ్లు పాల్గొన్నాయి. విజేత ఎద్దుల యజమానులకు బహుమతులు ప్రదానం చేశారు. బండలాగుడు పోటీలను తిలకించేందుకు భారీసంఖ్యలో రైతులు, గ్రామస్థులు తరలివచ్చారు.

చౌడేశ్వరీమాతకు ప్రత్యేక రథం



రథాన్ని లాగుతున్న పొట్టేళ్లు

బనగానపల్లె, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నందవరం చౌడేశ్వరీ మాత తిరునాళ్ల సందర్భంగా ప్రత్యేక రథాన్ని మాజీ ఎంపీపీ అశ్వర్థమాచారి తయారు చేయించారు. ప్రతి ఏడాది ఉగాది ఉత్సవాలకు పలుకూరు నుంచి తేరుబండి వెళ్లడం ఆనవాయితీ. అయితే శాశ్వతంగా తేరుబండి తయారు చేయాలనే తలంపుతో గ్రామస్థులు, గ్రామ పెద్దల సహకారంతో చేశారు. ఈ రథాన్ని 14 జతలు పొట్టేళ్ల లాగేలా రథం తయారు చేయించారు. ఈ సందర్భంగా అశ్వర్థమాచారి మాట్లాడుతూ శాశ్వతంగా తేరుబండి గ్రామస్థులకు ఉండేలా తానే స్వయంగా తయారు చేయించినట్లు తెలిపారు. తేరుబండిని తయారు చేసిని మాజీ ఎంపీపీని గ్రామ పెద్దలు, ప్రజలు అభినందించారు.

యాగంటిలో పల్లకి సేవ

బనగానపల్లె, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : యాగంటి ఉమా మహేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పల్లకీసేవ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఈవో చంద్రుడు, పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డి యాగంటిపల్లె ఉపసర్పంచ్ మౌళీశ్వరరెడ్డి, వివిధ గ్రామాల భక్తులు, ఆలయ పూజారులు పల్లకీలో ఉమామహేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

వైభవంగా చౌడేశ్వరీ మాత జ్యోతి ఉత్సవాలు

కొలిమిగుండ్ల, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోటపాడు గ్రామంలో చౌడేశ్వరీమాత జ్యోతి ఉత్సవాలు సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తి శ్రద్ధలతో, రంగు రంగుల కాగితాలతో అందంగా అలంకరించిన జ్యోతులను గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తొగటవీరుల నృత్య ప్రదర్శనలు ప్రత్యేకంగా అలరించాయి. స్థానిక చౌడేశ్వరీ మాత ఆలయంలో భక్తులు బోనాలు సమర్పించి, మొక్కులు చెల్లించారు. నాయకులు మూల శివారెడ్డి, సీతారామిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, చంద్రశేఖరరెడ్డి, భాస్కరనాయుడు తదితరులు అమ్మవారికి పూజలు నిర్వహించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఉయ్యాలవాడ, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లూరు గ్రామ సమీపంలో పాలేరు వంతెన మలుపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ నెల 22న కోవెలకుంట్ల-జమ్మలమడుగు జాతీయ రహదారిపై రెండు ఆటోలు ఢీకొన్న ఘటనలో కోవెలకుంట్ల మండలం గుంజలపాడు గ్రామానికి చెందిన బంటు రామాంజనేయులు(30) తీవ్రంగా గాయపడ్డాడు. 108 ద్వారా అతడిని నంద్యాల ప్రభుత్వ వైద్యాశాలకు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందినట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు.

ఉగాది క్యాలెండర్ ఆవిష్కరణ

సంజామల, మార్చి 31(ఆంధ్రజ్యోతి): శ్రీవిశ్వావసు నామ సంవత్సర త్రైత సిద్ధాంత తెలుగు యుగాది క్యాలెండర్‌ను సోమవారం ఎస్‌ఐ రమణయ్య ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంజామల మండలం రామిరెడ్డిపల్లె కమిటీ అధ్యక్షుడు రాజశేఖర్, సభ్యులు వెంకటసుబ్బయ్య, రమణ, ప్రసాద్, నాగేంద్ర, వెంకటరామయ్య, మద్దిలేటి, శివుడు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి సన్మానం

డోన్ టౌన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): డోన్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన సీలం బాస్కర్ నాయుడును టీడీపీ నాయకులు వాస్తు లక్ష్మన్న, వడ్డె గనమద్దయ్య సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో ఈద్-ఉల్-ఫితర్

- ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు
- ఆలింగనం చేసుకున్న ముస్లింలు
- శుభాకాంక్షలు తెలిపిన ప్రజాప్రతినిధులు
- నల్లబ్యాడ్జీలతో శాంతియుత ప్రదర్శన



కొలిమిగుండ్లలో నమాజ్ చేస్తున్న ముస్లింలు



బనగానపల్లెలో..



ఆలింగనం చేసుకుంటున్న చిన్నారులు

చాగలమర్రి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో రంజాన్ పండుగను ముస్లింలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు చేపట్టి ఆయా మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చాగలమర్రి ఈద్గా వద్దకు అధిక సంఖ్యలో పిల్లలు, పెద్దలు, యువకులు తరలివచ్చి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రభుత్వ ఖాజీ యూనస్ పండుగ విశిష్టత గురించి తెలియజేశారు. ప్రతి ఒక్కరు దైవమార్గంలో నడవాలని సూచించారు. ఈద్గా వద్ద ముస్లింల కోసం దాత చక్రం షబ్బీర్ చలువ పందిర్లు, కూల్ క్యాన్‌లు ఏర్పాటు చేశారు. విజయ పాలడెయిరీ ఉద్యోగి నాగరాజు ఈద్గా వద్ద 1,000 మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకొని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. రాష్ట్ర మైనార్టీసెల్ ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా, వైసీపీ మైనార్టీసెల్ కార్యదర్శి షేక్.బాబులాల్ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఎస్‌ఐ సురేష్‌నాయుడు, ఈద్గా వద్ద పోలీసు బందోబస్తు నిర్వహించారు.

నల్లబ్యాడ్జిలతో శాంతియుత ప్రదర్శన

కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న వక్ఫ్‌సవరణ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలంటూ సోమవారం ముస్లింలు నల్లబ్యాడ్జిలతో నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఖాజీ యూనస్, మత పెద్దలు, యువకులు కలిసి ప్రధాన రహదారి వెంట శాంతియుత ప్రదర్శ చేశారు.

రుద్రవరం : మండలంలో భక్తిశ్రద్ధలతో ఈద్ ఉల్ ఫితర్‌ను ముస్లింలు జరుపుకున్నారు. ఈద్గాలు, మసీదుల్లో నమాజ్ చేశారు. మత పెద్దలు రంజాన్ ప్రాముఖ్యతను వివరించారు.

డోన్ రూరల్: పట్టణంలో రంజాన్ వేడుకలను ముస్లీం సోదరులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణంలోని గుత్తిరోడ్డులోని ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

● శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే కోట్ల:

పట్టణంలోని గుత్తి రోడ్డు ఈద్గా ప్రాంతంలో ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి పాల్గొని ముస్లీంలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. అలాగే ముస్లింలకు మజ్జిగ, నీటి ప్యాకెట్లను అందజేశారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, మాజీ ఎంపీపీ శేషఫణిగౌడు, మాజీ సర్పంచ్ పెద్ద కేశవయ్య గౌడు తదితరులు ఉన్నారు.

డోన్ టౌన్: పట్టణంలోని గుత్తి రోడ్డులోని ఈద్గా మసీదులో ముస్లీంలు భక్తిశ్రద్ధలతో వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ముస్లీంలకు ఈద్గా మైదానంలో మత గురువు మదీనా మస్జీదు ఇమాంసాబ్ మూఫ్తి ఇస్మాయిల్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ శ్రీనివాసులు, అర్బన్ సీఐ ఇంతియాజ్ బాషా ఆధ్వర్యంలో ఎస్‌ఐ శరత్ కుమార్ రెడ్డి, రూరల్ ఎస్‌ఐ మమత, ఏఎస్‌ఐలు గోపాల్, వెంకటనారాయణ, పోలీసు బందోబస్తు నిర్వహించారు.

● వక్ఫ్ బోర్డు భూముల రక్షణ కోసం ప్రార్థన సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి శాంతియుతంగా ప్రార్థనలో పాల్గొన్నారు. మతగురువు మూఫ్తి ఇస్మాయిల్, జాకీర్ హుశేన్, కౌన్సిలర్ సాదిక్, సుభాన్ విలేకరుతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్‌బోర్డు బిల్లును రద్దు చేయాలని కోరారు.

ప్యాపిలి: మండలంలోని ప్యాపిలి, జలదుర్గం, రాచెర్ల, ఏనుగమర్రి తదితర గ్రామాల్లో సోమవారం రంజాన్ వేడుకలను ముస్లింలు నిర్వ హించుకున్నారు. స్థానిక జామీయా మజీద్‌లలో ముస్లీం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

ఆళ్లగడ్డ(శిరివెళ్ల): ఆళ్లగడ్డ, శిరివెళ్ల మండలాల్లోని గ్రామాల్లో రంజాన్ పర్వదినాన్ని ముస్లింలు సోమవారం



ఉయ్యాలవాడలో..



ఆళ్లగడ్డలో..



బేతంచెర్లలో శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే కోట్ల



సంజామలలో నిరసన తెలుపుతున్న ముస్లింలు

భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈద్గాలు, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. టీడీపీ ముస్లిం మైనార్టీ నాయకుల ఆహ్వానం మేరకు శిరి వెళ్లకు వచ్చిన ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ, భార్గవ్‌రామ్ దంపతు ల ను, టీడీపీ మండల కన్వీనర్ కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డిని కొత్తపేట బ్రదర్స్ శాలువా, పూలమాలలతో ఘ నంగా సన్మానించారు.

బనగానపల్లె : మండలంలో అన్ని మసీదు ల్లో, ఈద్గాల్లోనూ ముస్లింలు సామూహిక ప్రార్థనలు చేశారు. పట్టణంలోని ఈద్గాలో మతగురువులు



చాగలమర్రి ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ప్రభుత్వ ఖాజీ

ఆధ్యాత్మిక ఉపన్యాసాలు చేశారు. అలాగే పట్టణ శివారులోని అవుకు రహదారిలోని ఎస్సార్బీసీ కాలనీ సమీపంలో ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈద్గాల వద్ద సీఐ ప్రవీణ్‌కుమార్, సీఐ మంజునాథ్‌రెడ్డి, ఎస్‌ఐ దుగ్గిరెడ్డి, పోలీస్ సిబ్బందితో ప్రత్యేక పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు.

అవుకు : ముస్లింలు ఈద్గాల వద్దకు వెళ్లి ప్రార్థనలు చేశారు. మత గురువులు ఖురాన్ చదివి వినిపించారు. అనంతరం ముస్లింలు రామాపురం గ్రామానికి చేరుకొని టీడీపీ సీనియర్ నాయకుడు ఐవీ పక్కీరరెడ్డి, టీడీపీ అవుకు మండల అధ్యక్షుడు ఐ.ఉగ్రసేనారెడ్డిని కలిశారు.

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల పట్టణంతో పాటు రేవనూరు, అమడాల, సౌదరిదిన్నె, పెద్దకొప్పెర్ల, చిన్నకొప్పెర్ల, కలుగొట్ల తదితర గ్రామాల్లో ముస్లింలు ఈద్గాలకు వెళ్లి ప్రార్థనలు నిర్వహించారు. ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు.

కొలిమిగుండ్ల : కొలిమిగుండ్లలో ప్రభుత్వ ఖాజీ ఖాదర్‌వలి ఆధ్వర్యంలో ముస్లింలు మసీదులో నమాజ్ చేశారు. అనంతరం ఈద్గా వద్దకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో రిటైర్డ్ లైబ్రరీయన్ మహబూబ్‌ఖాన్ హుస్సేన్, బూడేన్‌సాహెబ్, బాబు, పుల్లయ్య, ముస్లింలు పాల్గొన్నారు.

బేతంచెర్ల: పట్టణంలో ఈద్గా వద్ద మండల ఖాజీ నూర్ అహ్మద్ ప్రత్యేక ప్రార్థనలు చేయించారు. డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఎల్ల నాగయ్య, చంద్రశేఖర్, తిరుమలేశ్ చౌదరి, జాకీరుల్లా బేగ్, డోన్ న్యాయవాది రాజశేఖర్ రెడ్డి, జయవర్ధన్ రెడ్డి, ఆయా మసీదుల పెద్దలు ముస్లీం సోదరులు పాల్గొన్నారు. బేతంచెర్ల సీఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్‌ఐ రమేష్‌బాబు పోలీసు బందోబస్తు నిర్వహించారు.

సంజామల: మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ముస్లింలు ఈద్ - ఉల్ - ఫితర్‌ను ఘనంగా నిర్వహించారు. ఈద్గాలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అన్వర్ మౌలాన నమాజులు చేయించారు. అనంతరం వక్ఫ్‌బోర్డు బిల్లుపై నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు.

ఉయ్యాలవాడ: ఉయ్యాలవాడ గ్రామ సమీపంలో కుందూనది ఒడ్డున ఉన్న ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఇంజేడు, హరివరం, నర్సిపల్లె, గోవిందపల్లె, కాకరవాడ, అల్లూరు, కొండుపల్లె తదితర గ్రామాల్లో ప్రార్థనలు చేశారు.

మైనార్టీలు నా కుటుంబ సభ్యులు మంత్రి బీసీ

బనగానపల్లె, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ముస్లింలు నా కుటుంబ సభ్యులు అని మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి అన్నారు. రంజాన్ పర్వదినం సందర్భం గా మంత్రి క్యాంపు కార్యాలయంలో బీసీ జనార్ధన్‌రెడ్డి కేక్ కట్ చేసి ముస్లింలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు ముస్లిం నాయకులు, సోదరులు మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు.

ముస్లింలకు రాజారెడ్డి శుభాకాంక్షలు



మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డిని కలిసిన ముస్లింలు

రంజాన్ పర్వదినం సందర్భంగా ము స్లింలకు మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. బీసీ రాజా రెడ్డి కార్యాయానికి భారీ సంఖ్యలో ము స్లింలు తరలి వచ్చారు. తమ కుటుంబం ఎల్లవేలలా అండగా ఉంటుందని ఆయన అన్నారు.

కమణీయం ...చెన్నకేశవస్వామి కల్యాణం

బనగానపల్లె, మార్చి 3 1 (ఆంధ్రజ్యోతి) : నందవరం చౌడేశ్వరిదేవి ఉగాది బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండవ రోజు సోమవారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఈవో జి.కామేశ్వరమ్మ, ఆలయ మాజీ చైర్మన్ పీవీ.కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉదయం చౌడేశ్వరిదేవికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో చెన్నకేశవ స్వామి ఆలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో ఆలయ అర్చకులు శ్రీదేవి , భూదేవి సమేత శ్రీ చెన్నకేశవస్వామి ఉత్సవ విగ్రహాలకు రాత్రి 10 గంటలకు కల్యాణం నిర్వహించారు. సారమ్మగారి నాగిరెడ్డి సతీమణి వేదవతి, గ్రామస్థులు పాల్గొన్నారు. అనంతరం స్వామి, అమ్మవార్ల విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు.

నేడు శ్రీచౌడేశ్వరీమాత రాయబారాది మహోత్సవం

ఉగాది బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడోరోజు మంగళవారం అమ్మవారి రాయబారాది మహోత్సవం నిర్వహించడానికి కార్యనిర్వహణాధికారి జి.కామేశ్వరమ్మ, ఆలయ మాజీ చైర్మన్ పీవీ.కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఉదయం చౌడేశ్వరి దేవికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. గ్రామ పెద్దల ఆధ్వర్యంలో సాయంత్రం గ్రామంలోని ఊరివాకిలి వద్ద ప్రత్యేకంగా అలం కరించి తేరుబండికి ఎద్దులను కట్టి గ్రామ శివార్లలో ఉన్న పొలి మేర వద్దకు అమ్మవారి రాయబారాది మహోత్సవం వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు.



అలంకరణలో స్వామి,అమ్మవార్లు

కస్తూర్బాలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

చాగలమర్రి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ప్రవేశాలకు ఈనెల 22 నుంచి ఏప్రిల్ 11 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎస్‌వో సునీత సోమవారం తెలిపారు. కస్తూర్బాలో 6వ తరగతి, ఇంటర్‌మీడియట్ మొదటి ఏడాది ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని అన్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లోని విద్యార్థినులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై విచారణ చేపట్టాలి

డోన్ టౌన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అనుమానాస్పదంగా మృతి చెందిన పాస్టర్ ప్రవీణ్ పగడాల మరణంపై న్యాయమైన విచారణ చేపట్టాలని డోన్ ఆవాజ్ కమిటీ ప్రధాన కార్యదర్శి ఎస్‌ఏ చిన్న రెహిమాన్, కమిటీ నాయకులు బి.అక్బర్ బాషా డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో షేక్షావలి, రఫీ, రసూల్, ఇమామ్, మహ్మద్ హుశేన్ పాల్గొన్నారు.

ఘనంగా గ్రామ దేవతకు ప్రత్యేక పూజలు



చాగలమర్రిలో పూజలు చేస్తున్న మహిళలు

డోన్ రూరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవరబండ గ్రామంలో సోమవారం గ్రామ దేవతకు జరిగిన ప్రత్యేక పూజలకు ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు. గ్రామ టీడీపీ నాయకులు, పెద్దలు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి పూలమాలలు వేసి సత్కరించారు. ఎమ్మెల్యే కోట్ల వెంట మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కేశన్నగౌడు, ఓబులాపురం శేషిరెడ్డి, దేవరబండ గ్రామ టీడీపీ నాయకులు, గ్రామ పెద్దలు ఉన్నారు.

రుద్రవరం : రుద్రవరంలో పెద్దమ్మ అమ్మవారికి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు బోనాలు సమర్పించారు. అయ్యప్పస్వామి కమిటీ సభ్యులు మజ్జిగ పంపిణీ చేశారు.

చాగలమర్రి: చాగలమర్రి గ్రామంలోని పెద్దమకానం వీధిలో వెలసిన పెద్దమ్మను ప్రజలు దర్శించుకున్నారు. మహిళలు బోనాలు నెత్తిన పెట్టుకొని ఊరేగింపుతో వెళ్లి పెద్దమ్మకు సమర్పించారు.

వైభవంగా సుంకుల పరమేశ్వరి తిరునాళ్లు



సుంకుల పరమేశ్వరి దేవాలయం వద్ద భక్తుల సందడి

రుద్రవరం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : రుద్రవరం, ఆర్.కొత్తపల్లె, కొత్తూరు గ్రామాలకు సరిహద్దుల్లో ఉన్న సుంకుల పరమేశ్వరి అమ్మవారు తిరునాళ్ల సోమవారం వైభవంగా నిర్వహించారు. ఎద్దులబండ్లపై భక్తులు దేవాలయానికి చేరుకున్నారు. అమ్మవారికి బోనాలు, చీరలు, ముక్కుపుడకలు సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.

సంజామల: మండలంలోని కాణాల గ్రామంలో వెలిసిన సుంకులమ్మ పరమేశ్వరీ దేవి తిరునాళ్ల వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉగాది పురస్కరించుకొని రెండు రోజులపాటు తిరునాళ్ల నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. సోమవారం అమ్మవారి ఉత్సవమూర్తిని అలంకరించి స్థానిక దస్తగిరి స్వామి ఆలయం నుంచి మేళతాళాలతో అమ్మవారి ఆలయంలో ప్రతిష్టించారు. గ్రామోత్సవంలో కోలాటం, చెక్కభజన కార్యక్రమాలు అలరించారు. భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.

- బండలాగుడు పోటీలు

కాణాల సుంకులమ్మ తిరునాళ్ల సందర్భంగా రాష్ట్రస్థాయి నాలుగు పండ్ల విభాగంలో ఎద్దుల బండలాగుడు పోటీలను నిర్వహించారు. 14 జతల ఎద్దులు పోటీల్లో పాల్గొన్నాయి. పోటీల్లో ఆరు జతల ఎద్దులు హోరాహోరీగా బండలాగాయి. మంగళవారం మరో ఎనిమిది జతల ఎద్దులు పోటీల్లో పాల్గొన్న తరువాత విజేతలను నిర్ణయిస్తున్నట్లు కమిటీ వారు తెలిపారు. ఎద్దుల బండలాగుడు పోటీలను తిలకించేందుకు అధిక సంఖ్యలో రైతులు పోటీ పడ్డారు.



కాణాల గ్రామంలో పూజల్లో పాల్గొన్న భక్తులు